# స్వయంభువు

గడియారం అరగంట కొట్టింది. రామదాసు ఉలిక్కిపడి దాని కేసి చూశాడు. ౪-౩౦ నిముషాలయింది. మరో అరగంటకల్లా కపాడియా తనదగ్గరకొస్తాడు. ఇక సాయంత్రం దాకా తన ప్రాణాలు తోడేస్తాడు. ఈ పీడనుండి తప్పుకోవాలంటే తను సెలవయినా పెట్టాలి. లేదా, అతని అప్లికేషను మీద సంతకమయినా పెట్టాలి. ఈ రెండింటిలో ఏది చెయ్యడమూ రామదాసుకిష్టంలేదు.

ఇప్పటికి దాదాపుగా పదిరోజులనుండీ ఈ తతంగం జరుగుతూఉంది. మామూలుగా అయితే, అతగాడి పని ఎప్పుడో పూర్తయిఉండేది. నిజానికి తనుగూడా చేదామనే అనుకొన్నాడు. కానీ, కపాడియా అనవసరమైన హంగామా చేశాడు. దాంతో వ్యవహారం నలుగుడులో పడిపోయింది. ఏడీ సంగతేమిటో అమీతుమీ తేల్చుకోవాలనిపించింది. అందుకే కాయితాన్ని తొక్కిపట్టాడు -

నిజమాలోచిస్తే తనకు కపాడియా అయినా ఒకటే, కనకయ్య అయినా ఒకటే! వచ్చిన దరఖాస్తులను చూస్తాడు. తనకు ఏది న్యాయంగా కనిపిస్తే ఆ దరఖాస్తుదారుకు లైసెన్సును మంజూరుచేస్తాడు. అన్నీ వొక్కలాగే ఎప్పుడూ ఉండవు. ఉంటాయనికూడా తను అనుకోలేదు. అథవా — అలా ఉండటమే జరిగితే, ఏం చెయ్యవలసిందీ అప్పుడే ఆలో

చించవచ్చు. రానిదాన్నిగురించి వచ్చిఉంటే, అని ఆలోచించటం అవివేకం; - అనుకొన్నాడు రామదాసు.

ఆలోచిస్తున్నకొద్దీ, తను అనవసరంగా ఉద్రేక పడుతున్నాడేమో ననిపించింది రామదాసుకు. కపాడియా పట్ల ఉండవలసినంత సానుభూతి లేదేమోననికూడా అని పిస్తోంది. ఎందుకంటే, అతని పేరెత్తితేనే లోలోపల చెప్ప రాని చిరచిరలు పుట్టుకొస్తున్నాయి. కర్మకాలి, ఇది తన బలహీనత కాదుకదా ?

రామదాసుకేమీ పాలుపోలేదు. ఈ విషవలయంలో ఎవరిది తప్పన్న విషయం తను తేల్చలేడు. శిలాపాపం, తలాకాస్త అన్నట్టుగా - ఈ ఫలితం అందరూ అంతో ఇంతో పుచ్చుకోవలసిందే! ఎవరి భయాలు వారికున్నాయి. ఎవరిస్వార్థం వారికున్నది. కపాడియా తనచుట్టూ తిరగడంలో సైతం తప్పులేదేమో ననిపిస్తోంది. తనలాగే, అక్కడి ఇనప రాయి తవ్వుకోందుకు చాలామంది దరఖాస్తులు పంపించి ఉంటారని కపాడియా అనుకోవడంలో తప్పులేదు. జగ్గయ్య పేటప్రాంతంలో మంచి ఇనపరాయి దొరుకుతుందని, ఎప్పుడో రుజువయింది. నూటికి 40 నుండి 45 శాతందాకా ఈ ముడిలోహంనుండి ఇనుము తీయవచ్చని నిపుణులు అంటున్నారు. ఈమధ్య భూగర్భ పరిశోధకశాఖవారి పరిశీ లనవలన నందిగామకూ, జగ్గయ్యపేటకూ మధ్య మునేరు వాంచనేఉన్న బీడుభూముల ప్రాంతంలో, మేలైన ఇనుపనిధు లున్నాయని తేలింది. ఈ ప్రాంతపు ముడిలోహంనుండి 50 మొదలు 60, 70 శాతందాకా మంచిలోహం వస్తుందని

గూడా పరిశోధనలవలన తేలింది. ఆ ప్రాంతాన్ని కౌలుకు తీసుకొనేందుకూ, అక్కడ తవ్వకాలు సాగించేందుకూ కపాడియా దరఖాస్తుపెట్టుకొన్నాడు. అందులో, తనప్రతిపత్తినిగురించి ఉటంకించాడు. గనులతవ్వకంలో తన కంపెనీకున్న అనుభవాన్ని సోదాహరణంగా చెప్పుకొన్నాడు. తన ఆధీనంలో ఉన్న సాధన సంపత్తిని వివరించాడు.

అంతా బాగానే ఉంది.

అయితే తనెందుకు దరఖాస్తును మంజూరు చేయలేక పోయాడు.

రామదాసు తనను తానే ప్రశ్నించుకొన్నాడు.

కపాడియా వో పొరపాటు చేశాడు. కాదు-చేశాడని తను అనుకొన్నాడు. అప్లికేషను తనకు అందినరోజునే ఆఫీసులో తనను కలుసుకొన్నాడు. తనకు ఎవరెవరితో సన్నిహితసంబంధాలున్నాయో చెప్పుకొచ్చాడు. కపాడియా తనను బెదరగొడుతున్నాడేమోనని, అప్పుడే రామదాసు కనిపించింది.

"ఇవన్నీ మీరెందుకు చెబుతున్నట్టు?" అన్నాడు రామదాసు.

కపాడియా కళ్ళల్లో ఇబ్బందిని తను గ్రహించాడు.

"మరేంలేదు. మీ రీ సెక్షనుకు కొత్తగావచ్చారు. ఇందులో ఉన్నలగువు బిగువులు మీకు తెలియనివి కావనుకోండి" అన్నాడు కపాడియా.

తనడిగిందాని కిది సరైనసమాధానం కాదని తెలిసి పోయాక, రామదాసుకు నవ్వొచ్చింది.

"మీకు తెలియందేమీ లేదు సార్! ఎంత కష్ట పడాలో మీకు చెప్ప నవసరం లేదు."

"దేనికి?" అన్నాడు రామదాసు.

కపాడియా, ఓ క్షణం రామదాసును ఎగాదిగా చూసి నిట్టూర్పు విడిచాడు.

"ఈ నమ్మకంతోనే బోలెడంత డబ్బుపోసి అమెరికానుండి మెషీన్లు తెప్పించాను" అన్నాడు కపాడియా కొంచెం సేపయ్యాక.

"మీ దరఖాస్తు ఆమోదించబడుతుందని మీరెందుకనుకొన్నారు?" అన్నాడు రామదాసు.

కపాడియా కొద్దిసేపు ఏమీ మాట్లాడకుండా నేల చూపులు చూస్తూ ఉండిపోయాడు. తరువాత మెల్లిగా తలెత్తి "మీ అభిప్రాయమేమిటో చెప్పారుకాదు" అన్నాడు.

"మరేం లేదు. మీరు వెళ్ళిరండి" అన్నాడు తను.

అప్పటికి కపాడియా వెళ్ళిపోయాడు. కానీ, ఆ రోజునుండి తనను పరోక్షంగా వేటాడుతూనే ఉన్నాడు - తన సహోద్యోగులూ, తనపైవారూ గూడా కపాడియా దరఖాస్తు విషయమై అడగడం ప్రారంభించారు. ఆఖరికి రామనాథం ఢిల్లీనుండి వ్రాసిన ఉత్తరంలో గూడా ఈ విషయమే ప్రస్తావించాడు.

" — ఇందులో నీ పుట్టి మునిగేదేమీ లేదు. ఆ దరఖాస్తు విషయం చప్పున తేల్చు. దిక్కుమాలిన కుశంకలన్నీ పెట్టుకొని సిద్ధాన్నం పాడుచేసుకోకు. కపాడియా శక్తి సామ

ర్యాలు నీకు తెలీవు. క్షణంలో నిన్ను నల్లమలా ఫారెస్టులోకి బదిలీచేయించగలడు. అంతదాకా రాకూడదనే అతనూ కోరుకొంటున్నాడు. నువ్వు చెయ్యవనుకో. అంతమాత్రాన అతనికి మంజూరు కాదనుకోకు. నీ తరవాత వచ్చేవాడు విధిగా ఆ పని చేస్తాడు. అలా చేసేవాడే ఆ సీటులో కూచునేవిధంగా కపాడియా ఏర్పాటు చెయ్యగలడు. వెంటనే జవాబురాయి _ అన్నట్టు - మా ఆవిడ, ఈ మధ్యనే కోనసీమకు వెళ్ళింది. ఆవిడ తిరిగి వచ్చేటప్పుడు మీ ఇంటికొస్తానంది. ఆవకాయ పెట్టిఉంచు. వెంటనే జవాబురాయి — ఉంటాను -"

ఆ ఉత్తరం పదేపదే చదువుకొని, ఉండకిందచుట్టి దూరంగా విసిరాడు రామదాసు. పదినిమిషాలయ్యాక, తిరిగి ఉండను తెచ్చి సాపుచేశాడు. ఆ ఉత్తరంచూశాక రామదాసు మనస్సులో కపాడియా బొమ్మ పెద్దసైజుకు పెరిగింది -

ఈలోపుగా కపాడియా ఆఫీసుకొస్తూనే ఉన్నాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడి దరఖాస్తువిషయం కదిలించి పోతూనేఉన్నాడు. ఒకనాడు మాటల సందర్భంలో, కపాడియా తన జన్మస్థల మడిగాడు.

"గుంటూరు" అన్నాడు రామదాసు.

"అక్కడ మనకు ఆస్తి ఏమన్నాఉందా సార్?" అన్నాడు కపాడియా.

"లేదు" అన్నాడు రామదాసు.

"చాలా కష్టమండీ! డబ్బు లేనివాడు ఈ రోజుల్లో డబ్బుకు కొరగాడు."

"నే నలా అనుకోవడం లేదు" అన్నాడు రామదాసు.

"మీకు నేను చెప్పవలసినవాణ్ని కాదనుకోండి. ప్రపంచమనేది గొప్ప యుద్ధరంగం. ప్రతిక్షణం, జీవులు ఒకదానితో వొకటి యుద్ధంచేస్తూఉన్నాయి. బలం ఉన్నవి గెలిచాయి, లేనివి నశించాయి" అన్నాడు కపాడియా.

రామదాసు, చేస్తున్నపని ఆపేసి, కపాడియా కేసి చూశాడు.

"అనాదినుండీ ప్రకృతికీ, ప్రాణికీ భయంకరమైన సమరం సాగుతోంది. ప్రకృతి ప్రాణిని సంహరించాలని చూస్తుంటే, ప్రాణి ఆత్మరక్షణ చేసుకొంటూ, ప్రకృతిని లొంగదీసుకొందుకు ప్రయత్నిస్తూఉంది. ఇవన్నీ మీకు తెలియని సంగతులు కావు— మాటవచ్చిందిగనుక చెబుతున్నాను—మంచుయుగంలోని జంతువులు ఆ యుగంపోగానే నశించిపోయాయి. ఒకప్పటి 'మామత్' లూ, జడల గుర్రాలూ, దయ్యపుబల్లులూ ఇప్పుడున్నాయంటారా?" అన్నాడు కపాడియా.

"లేవు" అన్నాడు రామదాసు.

"ఎందువల్ల నంటారు?"

"అది నేనడగవలసిన ప్రశ్న?" అన్నాడు రామదాసు నవ్వుతూ.

కపాడియాకూడా నవ్వాడు.

"నాచేత చెప్పించాలనిగానీ, మీకు తెలీక కాదు రామదాసుగారూ! అవి కాలంతో బాటు, వాతావరణంతో బాటు, పరిసరాలతో బాటు మారలేకపోయాయి. ధ్వంసమై పోయినాయి. కాలానుగుణంగా మారుతున్నవన్నీ బ్రతికాయి. అలాగే ఇప్పుడుకూడాను. ఈయుగం డబ్బుయుగం. డబ్బున్నవాడు రాజు, డబ్బున్నవాడు దేవుడు. డబ్బును నిర్లక్ష్యం చేసి, ఈయుగంలో ఎవరూ బ్రతకలేరనుకుంటాను. నేను డబ్బున్నవాణ్ని గనక ఇలా అనడంలేదు. డబ్బు లేకపోయినా, నాకిలాంటి అభిప్రాయమే ఉండేదనుకొంటాను" అన్నాడు కపాడియా. "ఇన్నిటికీ ఈ సంగతెందుకొచ్చిందంటారు?"

"నాఆస్తినిగురించి మీరడిగితే," అని అందించాడు రామదాసు.

"అవునవును," అని ఫక్కున నవ్వాడు కపాడియా. "ఈమధ్య ఢిల్లీ వెళ్ళినప్పుడు, రామనాథంగారు కనిపించారు. మీసంగతులుకూడా మాట్లాడుకొన్నాం. అప్పుడు ఆస్తుల గొడవ వచ్చినట్లులేదు. అందుకనే అడిగాను..."

"నిజానికి ఇవన్నీ నాకనవసర మనుకోండి. వినాలనుకొందికీ అడుగుతున్నాను. మీకిప్పుడు ముగ్గురు పిల్లలు. మరో ఏడాదికి మీ పెద్దవాడు కాలేజీలో చేరతాడు. అమ్మాయి పెళ్ళికొస్తుంది. అప్పుడు మీకొచ్చేజీతం చాలుతుందనుకోను. చట్టాలు— కట్నాన్నినిషేధించినా, లోపాయికారితనం, మీకు తెలిసేఉంటుంది. మీ అమ్మా, నాన్నా–ఉన్న ఆస్తినంతా అమ్మేసి మిమ్మిస్థితికి తెచ్చారు.

కానీ, ఈపాటిస్థితిని మీరు మీపిల్లల కివ్వగలరా? లేరని నాకు తెలుసు. కానీ వారిజీవితాలకు పునాదులు వెయ్యవలసిన బాధ్యత మీ మీద ఉంది. ఆబాధ్యతనుండి తప్పుకో చూడడం క్షమించరాని నేరమే మోననుకొంటాను..."

అప్పటికే రామదాసు ముఖం నల్లబడిపోయింది. చిరిచెమటలుపోశాయి. మనిషి అదోలా కుదించుకుపోయాడు.

"భగవంతుడు బుద్ధిహీనుల్ని ఎప్పుడూ క్షమించలేడు. సుఖపడటానికి కావలసిన అవకాశాలు కల్పించాడు. వాటిని ఉపయోగించుకోనలేకపోవడం మనదే తప్పు...లోగడ—ఈ సెక్షనులోనే సింహాద్రిగా రుండేవారు. ఆయనగారు—పాపం చాలా మంచివాడు! మూడేళ్ళున్నాడు. ఆయనచేసిన ఉపకారం ఇంతా అంతా కాదు. నేనయినా ఋణం ఉంచుకోలేదనుకోండి. బషీర్ బాగ్‌లో, మసీదుప్రక్కనేవున్న బిల్డింగ్ చూశారుగా! అది నేనే కట్టించాను. ఇప్పుడా ఇంటిమీద నెలకు రెండొందలకు తక్కువకాకుండా సింహాద్రిగారికే అద్దె దొరుకుతోంది. —సరే వస్తానండీ! ఇప్పటికే చాలా ప్రొద్దుపోయింది. నావిషయం - ఏదోవొకటి తేల్చేయండి!" అంటూనే కపాడియా వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక, రామదాసు ఆరుబైట కూచున్నాడు. శకుంతల సన్నజాజులు చిరిచాపమీద పోసుకొని దండ గుచ్చుతూఉంది.

"కోటేశ్వరరావు గారి భార్య లేదూ?" అంటూ ప్రారంభించింది శకుంతల.

రామదాసు భార్యకేసి చూశాడు.

"రవ్వల నెక్లెసు చేయించుకొంది. ఎంత బాగుందను కొన్నావు! పదహారొందలుట. రాళ్ళు చూస్తుంటే కళ్ళు చెదిరి పోతున్నాయనుకోండి—" అన్నది శకుంతల.

"పదహారొందలే!" అన్నాడు రామదాసు ఆశ్చర్య పోతూ.

"అయితేనేం? అదేదో కంపెనీవారికి ఏదో చేశా డుట. ఆ కంపెనీవాళ్ళే కొనిచ్చారుట. ఈసంగతి ఆవిడనలే దంటోయ్! సూర్యకాంతం లేదూ, ఆ సబిడ్డ—ఆవిడ చెప్పింది."

"అలాగేం?" అనగలిగాడు రామదాసు.

"నిలువుటెత్తు బీరువాలనిండా ఆవిడకు చీరలున్నాయి. ఈఏడు కారుకూడా కొంటారుట... దేనికయినా రాతఉండా లండీ రాత! మళ్ళీ మీఅంతే జీతం! వాళ్ళేమో సొంతఇంట్లో ఉంటుంటే, మనం కీగర్లో అంటూ అద్దెకొంపల్లో పడేడుస్తు న్నాం! వాళ్ళ పెద్దబ్బాయిని, వచ్చేఏడు అమెరికా పంపుతా రట. అందుకోసం వాళ్ళాయన ఈమధ్య, ఎవరెవరికో ఉత్త రాలుగూడా రాశాడుట"

దండ గుచ్చడం అయిపోయింది. సూదిని పళ్ళమధ్య బిగించి, దండను వరసలుగా పేర్చి, రెండుచేతులూ వెనక్కి చాపుకొని, దండను తురుముకొంది శకుంతల.

"సుభద్రకూడా నా యీడుదే! తిరగేస్తే చుట్ట రికం కలియకపోదు. చిన్నప్పుడు, ఒకేబళ్ళో చదువుకొన్నాం గూడా. దానిఅదృష్టం అదీ, నా అదృష్టం ఇదీనూ ..."

కుచ్చిళ్ళు దులుపుకొని, అటూఇటూ సరుకొని, చాప

చుట్టుతూ, భర్త కేసి చూసింది శకుంతల. ఆ తరువాత పెదిమ విరుస్తూ నిట్టూర్పు విడిచింది.

"పడుకొంటారా, ఆఫీసుపని చూసుకొంటారా ?" అన్నది శకుంతల ఇంట్లోకి పోతూ.

"వొంట్లో బాగా లేదు. కాస్సేపిలా కూచుంటాను" అన్నాడు రామదాసు.

శకుంతల వెళ్ళిపోయింది.

అతనికి బాగా లేనిమాట నిజమేగానీ, అది వొంట్లో కాదు, మనస్సులో. మధ్యాహ్నం కపాడియా అన్న మాటలూ, ఇప్పుడు శకుంతల చెప్పిన కబుర్లూ రామదాసు మనస్సును కలచి వేశాయి. కపాడియా చెప్పింది సత్యమే ! అయితే ఆ సత్యం అతనెందుకు చెప్పిందీ రామదాసు గ్రహించాడు. ఎందుకోసం చెప్పనీ - అది సత్యమని తను నమ్మినప్పుడు, ఆ మాట వొప్పుకోపడానికేం ! అనేకసార్లు, తనకూ తనవారిని గురించిన ఆలోచనలు వచ్చాయి. తన తరవాత తనపిల్లలు ఏమవుతారన్న ప్రశ్నకు తను ఏనాడూ సరైన జవాబు చెప్పుకోలేకపోయాడు. ఇప్పుడప్పుడే తనకు డబ్బు యిబ్బందులు లేనిమాట నిజమే ! కానీ, ఇకముందు రావన్న గ్యారంటీ లేదు. తన బిడ్డలు చదువుకోవాలి. వారికి పెళ్ళిళ్ళు చెయ్యాలి. వారి సంసారాలు వారికి ఏర్పాటు చెయ్యాలి. ఇవన్నీ సక్రమంగా జరిగేందుకు తన జీతం- సరి పోతుందనుకోవడం భ్రమ. అందు కేదో చెయ్యాలని అను కొంటూనే ఉన్నాడు తను. అయితే ఏం చెయ్యవలసిందీ తను తేల్చుకోలేకపోయాడు. ఆ పని కపాడియా సూచిం

చాడు. సహోద్యోగులు సూచించారు. భార్య సూచిం
చింది –

కోరికలు చంపుకోమనడం సులభమేగానీ, చంపు
కోడంమాత్రం సులభంకాదు. /ఇరుగు పొరుగులను
చూసినప్పుడు, వీరిలాగ తనూ సుఖంగా ఉండాలను
కోవడం శకుంతల తప్పుకాదు. నిజానికి తనేంచేశాడు గనుక
శకుంతలకు ? తిండీ, గుడ్డా ఇవ్వటమే చెయ్యటమయితే, ఆ
పని చాలామంది చేస్తున్నారు. మరి తన ఘనతేమిటి ? లోక
మంతా ఏదో వో దోవన పోతూఉంది. తనూ అదే
మార్గాన పోవడం మంచిది. అదైనా తను చేస్తున్న పాడుపని
ఏమీలేదు. తను కాకపోతే ఇంకోడెవడో దాన్ని మంజూరు
చేస్తాడు. ఆ నాలుగు పిచ్చికలూ పుచ్చుకొంటాడు. ఆ పని
తనేచేసి ఆ లాభం తనే ఎందుకు పొందగూడదు ? తనైనా
ఉండి చెయ్యటం కాదు. కావాలనీ, చెయ్యటంకాదు. పరిస్థి
తులు అలా ముసురుకొస్తున్నాయి. తనచేత చేయిస్తున్నాయి.
మనిషి పరిస్థితుల వారసుడనుకొంటే, తనను తను నెపపెట్టు
కోవడానికేమీ ఉండదు.

రామదాసు ఈ నిర్ణయానికొచ్చాక, ఎంతో ఉత్సా
హంగా కనిపించాడు. ఈ కారణం దొరక్కనే అతను
ఇంతకాలం మథనపడుతున్నాడేమోనని ఎవరికయినా అని
పించడం సహజం ! ఏదో ఓ పనిచేసి, అలా చెయ్యవలసిన
అవసరాన్ని ఇంకోరిమీదకు నెట్టేందుకు ప్రయత్నించ
డంలో, హృదయం కొంత ప్రశాంతతను పొందుతుం

దేమో ! లేని పక్షంలో, ఈ మాత్రం కారణం అతనికి దొరక్కపోయిందా ఇంతకాలం ?

## 2

ఆ మొన్నాడు ఇంటికొస్తూనే, రామదాసు సోఫాలో చేరగిలబడ్డాడు. శకుంతల మంచినీళ్ళగ్లాసు తెచ్చి బల్ల మీద పెట్టింది.

“పిల్లలేరీ ?” అన్నాడు రామదాసు, జేబుగుడ్డతో ముఖమంతా తుడుచుకొంటూ.

అతని వంటినిండా ఏనాడూ పోయనంత చెమట పోస్తూఉంది.

“ఆడుకోవటానికి వెళ్ళారుగానీ ... మీ రలా ఉన్నారేం ?” అన్నది శకుంతల.

“అబ్బే ! ఏమీలేందే ?”

అన్నాడు గానీ, ఆ మాటలు అతనే నమ్ముతున్నట్టు లేదు. కంఠంలో ఎక్కడో వొణుకు ధ్వనిస్తోంది. మాటలు పెకలించుకొని వచ్చినట్టుగా ఉన్నాయి. కొత్తగా స్టేజీ ఎక్కిన నటుడుపడే తొట్రుపాటులాంటిదేదో శకుంతల అతనిలో చూసింది.

“కాఫీ పెట్టివ్వనాండీ ?” అన్నది భార్య రామదాసుకేసి ఎగాదిగా చూస్తూ.

“వద్దు ... ఇప్పుడే కడుపు మొయ్యా పట్టించి వచ్చాను ...” అన్నాడు రామదాసు నవ్వి.

ఆ నవ్వులోని మార్పును శకుంతల ఇట్టే పట్టేసింది!

"కారుమీద వచ్చారా ఏం?" అన్నది శకుంతల మారేమనడానికీ తోచక.

రామదాసు ఉలిక్కిపడి భార్యవేపు చూశాడు.

"అహా ... మనవాకిట్లో కారాగిన చప్పుడయితేనూ ... ఓ వేళ పొరుగింటి కొచ్చిందేమో లెండి"

ఈసారి రామదాసు పలకలేదు. రెండుచేతులతోనూ ముఖాన్ని గట్టిగా రుద్దుకొన్నాడు.

"వీధి తలుపు వేశావా?" అన్నాడు రామదాసు వీధివేపు బితుకు బితుగ్గా చూస్తూ.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి నీ మొహం? వీధి తలుపులు ఎందుకేస్తారో అందుకే!" అన్నాడు రామదాసు.

చాలా చమత్కారంగా మాట్లాడుదా మనుకొన్నాడు. కాని చాలా పెలుసుగా ఉన్నట్టు అతనికే అనిపించింది.

"ఒంట్లో బావోలేదా? పోనీ పెందరాడే చెంబెడు నీళ్ళుపోసుకొని రెండు మెతుకులు తినగూడదూ?" అన్నది శకుంతల.

"తిండాంలేవే వెధవతిండి! రోజూ తినడంలా? కాస్తంత పొద్దుపోతే నటునటలాడిపోతానేం?" అన్నాడు రామదాసు.

శకుంతల విసుక్కున్నట్టు ముఖంపెట్టింది.

రామదాసు అటూ ఇటూచూసి, కోటు జేబులోంచి

పెద్ద కవరుతీశాడు. అలా తీస్తున్నప్పుడు అతనిచేయి వణకడాన్ని శకుంతల చూసింది! క్షణకాలం ఆమెకళ్ళనిండా ఆశ్చర్యం మెసిలాడి మాయమయింది. ఆ కవరుకేసి కళ్ళు చిట్లించి చూసింది. చేయిచాపి అందుకొంది. ఆమె వేళ్ళకు గరగరలాడుతూ ఏవో కాయితాలు తగిలాయి. ఆ వెంటనే శకుంతల్లో మార్పేదో జరిగింది. ఆ కవరులోనుండి ఆమెలోకి విద్యుత్ప్రవాహం ప్రవహించినట్లు చలించిపోయింది. సంతోషం పొంగిపోతున్నట్లు కళ్లు మిలమిలలాడాయి. చెక్కిళ్లు గండరించాయి పెదవులు నిశ్శబ్దంగా గొణిగాయి. ఆమెచెయ్యికూడా వొణికింది. చప్పున తన పమిట వెనుక దాచేసింది. కళ్ళకు దీపకాంతి పడకుండా చేతినడ్డం పెట్టుకొని వీధికేసి చూసింది. అదృష్టవశాత్తూ ఆ క్షణాన వీథిలో నడుస్తున్నవారెవ్వరూ శకుంతలకు కనిపించలేదు.

“ఎంత ?” అన్నది శకుంతల, దగ్గి గొంతు సరిజేసుకొంటూ.

రామదాసు మాట్లాడకుండా, కుడిచేతి వేళ్ళను రెండుసార్లు ముడిచి చూపించాడు.

“వందలా ?”

రామదాసు తల అడ్డంగా తిప్పాడు.

శకుంతల కళ్ళల్లో మెరుపు మరింత అధికమయింది.

పదినిమిషాలపాటు ఎవ్వరూ పలకలేదు. పిల్లలు రాకపోయినట్లయితే, ఇంకెంతసేపయినా అలానే ఉండిపోయేవారేమో!

రామదాసు అపూట సరిగ్గా అన్నంతినలేదు. రెండు

మెతుకులు అటూఇటూ కెలికి చెయ్యి కడుక్కొన్నాడు. శకుంతల స్వయంగా తాంబూలం తెచ్చి యిచ్చింది. పడక్కుర్చీ తెచ్చి పందిరికింద వేసింది. పేపరు, మంచినీళ్ళగ్లాసు బల్లమీద పెట్టింది.

"క్షణంలో వస్తాను." అంటూ వంటింటికేసి వచ్చింది.

ఎవరన్నా అక్షణాన చూస్తే శకుంతల నడకలోని మార్పును ఇట్టే గ్రహించిఉండేవారు. చిన్నవాడేమోగానీ, పెద్దబ్బాయిమాత్రం ఏదో జరిగిందనుకొన్నాడు.

అయితే ఆ జరిగిందేమిటో వాడు ఊహించలేకపోయాడు. రోజుకన్నా ఆరోజున తల్లిగొంతు పెరిగిందనుకొన్నాడు. కుఁయ్‌మంటే, తల్లి తారామండలానికి లేవడం వాడికి ఆశ్చర్యంగాతోచింది. రోజూ నాన్నకు గరిటెడు నెయ్యి వేసే అమ్మ, ఆరోజున గిన్నెతో వడ్డించడం వాడు చూశాడు. సాయంత్రంపూట 'చిట్టి' నాన్నదగ్గిర కూచుని అన్నం తింటుంది. దాని కదో అలవాటు. ఈపూట అమ్మ వేరేపెట్టింది. అది 'తినన్నో మొర్రో' అంటే 'తినకపోతే గంగలోకలవ' మంది. నాన్నన్నా మెత్తబడ్డాడుగానీ, అమ్మ మాత్రం మెత్తబడలేదు.

"పోనీ, కూచోనివ్వరాదుటే?" అన్నాడు నాన్న.

"ఆఁ పోనిస్తురూ. వెధవలవాట్లు. ఇంకోమనిషి కూచుంటే, ఇవతలవాళ్ళకు సరిగ్గా తినబుద్ధేకాదు...మీకెందుకూ? మీరు తిని వెడుదురూ! దానిసంగతి నే చూచుకొంటాను!" అన్నది అమ్మ.

చిత్రం! నాన్నగూడా గమ్మున తిని పోయాడు!!

శకుంతల ఇవతల కొచ్చేసరికి, పెద్దవాడు దీపంముందు కూచుని పుస్తకం చూస్తున్నాడు.

"వెళ్ళి పడుకోరాదుట్రా" అన్నది శకుంతల.

"చదువుకోవాలి" అన్నాడు వాడు.

"పగలల్లా చదివింది చాలదుట్రా ? అర్ధరాత్రిదాకా కూచోపోతే ?"

వాడు గడియారం కేసి చూశాడు. తొమ్మిదికీ ఇంకా పది నిముషాలు తక్కువగానే ఉంది !

"ఇప్పుడే పడుకొంటే నిద్రరాదే!"

"ఎందుకొస్తుందిరా ! మీ కసలే నిద్ర పాపలు వచ్చె !" అంటూనే అన్నంముందు కూచుంది.

ఆవిడకూ ఆపూట అన్నంసహించటంలేదు. పప్పులో దోసకాయ వెగటుగా ఉంది. అన్నం పములుడు బడుతుంది గానీ ముద్దదిగందే ! గబగబా ఇన్ని మజ్జిగపోసుకొని రెండు గుటకలు వేసింది. అదీ సహించలేదు. చెయ్యి కడుక్కొని వళ్ళెం పీటకిందికితోసి లేచింది.

పెద్దాడు నిండా ముసుగుకప్పుకు పడుకొన్నాడు. పందిరి కింద పడకుర్చీ ఖాళీగా ఉంది. రామదాసు గదిలో దీపం వెలుగుతోంది.

ఆమెబుగ్గలు ఎరుపెక్కాయి. తనలో తనే నవ్వుకొంది. గూట్లోఉన్న మధ్యాన్నపు మల్లెదండను ముడిమీద సర్దుకొంది. కళ్ళకు సన్నగా కాటుక దిద్దుకొని, వేలిని తలకు రాచుకొంది. దొడ్డితలుపుకూ, వంటగదికీ గడియలు పెట్టింది.

ఓసారి ట్రంకుపెట్టె తాళంలాగి చూసుకొని, తాళంచేతులు వేలికి తగిలించుకొని గదిలో కొచ్చింది.

రామదాసు అటు తిరిగి పడుకొన్నాడు. మెడదాకా శాలువా కప్పుకొన్నాడు.

"ఇంతలోకే నిద్రా ?" అన్నది శకుంతల.

రామదాసు పలకలేదు.

ఆమె తాంబూలం వేసుకొని, పండిందో లేదో ఓసారి నాలుకచాపి చూసుకొని, చప్పుడుకాకుండా తలుపును దగ్గరగానొక్కి, భర్తమంచంమీద కూచుంది.

అప్పటికీ రామదాసు కదలలేదు.

"ఈ బిగింపు ఎంతసేపులే!" అన్నది శకుంతల నవ్వుతూ.

అయినా రామదాసు పలకలేదు...

"నిజంగా నిద్రేనా?" అంటూ రామదాసుగూడను పట్టుకొని ఇటుగా తిప్పింది శకుంతల.

అప్పుడు కళ్ళు తెరిచాడు రామదాసు.

శకుంతల ఏదో అనబోయింది.

"అవునుగానీ—" అన్నాడు రామదాసు.

శకుంతల ఆగిపోయింది.

"కోటేశ్వర్రావు భార్యచేయించుకొన్న నెక్లెస్ ఎంతన్నావూ?" అన్నాడు రామదాసు.

శకుంతల చెప్పింది.

"ఎక్కడ చేయించిందిట?" అన్నాడు రామదాసు.

శకుంతల చెప్పింది.

"పోనీ మరోటి నువ్వుగూడా పుచ్చుకోరాదూ?" అన్నాడు రామదాసు.

"నాకు చేయిస్తారా ఏమిటి?" అన్నది శకుంతల.

లాంఛనంగా ఆమాట అన్నదేగానీ, తప్పకుండా చేయిస్తాడన్న నమ్మకం ఆవిడకున్నది

"ఇవ్వాళ —" అన్నాడు రామదాసు.

"ఊఁ" అన్నది శకుంతల.

కాస్సేపు ఎవ్వరూ పలకలేదు.

"జరగండి" అన్నది శకుంతల.

రామదాసు జరిగాడు.

"సంతకం చేశాను," అన్నాడు రామదాసు. "మానవుడు బ్రహ్మానందపడ్డాడనుకో"

"ఎవడికోసం పడతాడేం?" అన్నది శకుంతల.

"ప్రస్తుతానికి ఇంతవరకూ ఉంచమన్నాడు. మళ్ళాకేపో ఎల్లుండో కనిపిస్తానన్నాడు."

"మీరు మోహామాటపడకండి! వచ్చినంతా పిండుకోండి." అన్నది శకుంతల.

రామదాసు పలకలేదు.

మనకు మహా దానంఇస్తున్నాడేమిటి? అవతల లక్షలకు లక్షలు పోసుకోవడంలేదూ? రేపు మనకేమన్నా భాగంగానీ ఇస్తాడా? ఏది రాల్చుకున్నా ఇప్పుడే! ఏదో సామెత చెపుతారు చూశారూ, అక్కరతీరాక అల్లుడు ఏదో అవుతాడని—"

"అవునవును!" అని గొణిగాడు రామదాసు.

దీపం ఆరిపోయింది. చీకట్లు ముసురుకొన్నాయి. గాజులు సున్నితంగా గిలగిలలాడి ఆగిపోయాయి. వెచ్చని నిట్టూర్పులు, చిన్న ఆయాసం, గుసగుస, మెత్తనినవ్వు—తరువాత దీపం వెలుతురు.

రామదాసు వెల్లకిలా పడుకొనిఉన్నాడు.

వరండాలోనించి శకుంతల పొడిదగ్గు వినిపించింది.

రామదాసు అటూ ఇటూ మసిలాడు. కళ్ళుగట్టిగా మూసుకొన్నాడు. అయినా నిద్ర రావడంలేదు. ఏదోభయం అతన్నావరించింది. లోపలినుండి చలి పుట్టుకొస్తోంది. మెడదాకా దుప్పటి ముసుగెట్టుకొన్నాడు. చలి తగ్గలేదు. రాను రాను ఇంకా ఎక్కువవుతూ ఉంది. లేచివెళ్ళి, కిటికీతలుపులు మూశాడు. దీపముంటే నిద్రపట్టదని ఆర్పేసి డిమ్మర్ వెలిగించి, మళ్ళీ కళ్లుమూసుకొన్నాడు. తనకు నిద్రపట్టక పోవడానికి దీపం కారణం కాదని తేల్చుకొన్నాడు.

ఎంత చెరిపేసుకొందామన్నా మధ్యాహ్నం బొమ్మ చెరిగిపోవడంలేదు. తను కపాడియా అప్లికేషనుమీద సంతకం చేశాడు. అతను పొడుగుపాటి కవరు తనకిచ్చాడు. తను నిశ్శబ్దంగా దాన్నితీసి, ముందుగా డ్రాయర్లో పెట్టాడు. దానిమీద ఆఫీసు కాగితాలు కప్పాడు. అలా కప్పడంవల్ల ఇంకోరెవరూ అనుమానించడానికి వీలుండదనుకొన్నాడు. ఆ వెంటనే ఇంకో అనుమానమొచ్చింది. ఆఫీసు కాగితాలు తీసేప్పుడు పొరబాటున ఆ కవరు కిందపడితే ? అందులోని నోట్లన్నీ గదంతా పరుచుకొంటే ? అదెవరన్నా చూస్తే ? ఈ అనుమానం రాగానే రామదాసు గజగజలాడిపోయాడు.

చప్పుడు కాకుండా ఆఫీసు కాగితాలు పక్కకు తొలగించి, కవరును మడిచి కోటు జేబులో పెట్టుకొన్నాడు. అలా పెట్టుకోవడం ఎవ్వరూ చూడలేదనుకొని, నిట్టూర్పు విడిచాడు. కలం విదిలించి ఏదో రాయబోయాడు, మళ్ళా అనుమానం వచ్చింది. డ్రాయర్లో ఉండటమే మంచిదేమో ? పుటిక్కన ఎవడన్నా వచ్చి జేబులో చెయ్యిపెట్టిచూస్తే ? వాడికి కవరు దొరికితే ? ఇదెక్కడిదని, తనను పిలవేసి అడిగితే ? రామదాసు సమాధానంకోసం గింజుకొన్నాడు. కవరును మళ్ళీ తీసి సొరుగులోనే ఉంచాడు. కానీ ఈసారి ఇంకో అనుమాన మొచ్చింది. అక్కడ్నించి తీసి జేబులో పెట్టుకొన్నాడు. మరేదో తోచింది. అక్కడనించి తీసి తిరిగీ డ్రాయర్లో పెట్టాడు.

ఈవిధంగా, సాయంత్రం దాకా జరిగింది. ఎక్కడ దాచవలసిందీ నిర్ణయం కానేలేదు. సాయంత్రం కపాడియా కారు తీసుకొచ్చాడు. రామదాసు తత్తరబిత్తరలాడుతూ కార్లో కూచున్నాడు. అప్పుడే ఆఫీసు విడిచిపెట్టారు. అందువల్ల, చాలామంది బయటే నిలబడిఉన్నారు. రామదాసు వారికేసి చూడలేదు. చూడటానికి భయమేసింది. భయపడుతూ భయపడుతూ వోరకంటితో చూశాడు. నలుగురూ గుంపుగా చేరి నవ్వుకొంటున్నారు. రామదాసు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. వాళ్ళు తననుచూసే నవ్వుతున్నారనుకొని కుంగిపోయ్యాడు.

ఈ సంగతులన్నీ కళ్ళల్లో తిరుగుతున్నాయి. వీటిని చెరిపేసుకొందామని రామదాసు ప్రయత్నం. మేలుకొంటు

న్నంతకాలం ఈ జ్ఞాపకాలు తప్పవు. చప్పున నిద్రపడితే ఎంత బావుండును!

అదేం చిత్రమోగానీ, అతను నిద్రకోసం చూస్తున్న కొందికీ, అది దూరదూరం జరగసాగింది. కావాలనుకొన్న నిద్ర రాకపోవటమూ, రావద్దనుకొన్న జ్ఞాపకాలు రావటమూ, రామదాసుకు కొత్త అనుభవం!

ఇప్పటికి అనేకసార్లు తనకు తనుధైర్యం చెప్పుకొందుకు ప్రయత్నించాడు రామదాసు. అలాంటిదేమీ జరగటానికి అవకాశం లేదని తనకు గట్టిగా తెలిసినా, జరిగిందేమోనన్న అనుమానం కుమ్మరి పురుగులా ఓమూల తొలుస్తూనేఉంది! తన గదిచాయల కెవ్వరూ రారు. రాదలుచుకొన్నవాళ్ళు విధిగా తన అనుమతిపొందాలి. ఆ సంగతి నిజమే అయినా మరెవరో చూస్తారన్నభయం తనకు వదలటంలేదు. ఇది నిష్కారణమని సరిపెట్టుకోవచ్చు. కానీ ఏదో వో కారణం ఉండాలనిపిస్తోంది. ఆకారణమేదో తనకు చిక్కడంలేదు.

రామదాసు మంచంమీదనుండి లేచాడు. గదిలో మెల్లగా పచార్లుచెయ్యసాగాడు.

"లేదులేదు. ఇంకోడు చూడటానికి అవకాశంలేదు" అనుకొన్నాడు గట్టిగా.

అలా అనుకొంటూన్నకొందికీ అతనిలో భయంతగ్గడానికిమారు ఎక్కువవుతోంది. గుండెలన్నీ దడదడమంటున్నాయి. కండరాలను ఎవరో పిసికేస్తున్నట్లు నొప్పులెత్తుతున్నాయి. నరాలు జివ్వుమని తీసుకుపోతున్నట్లు గిలగిలలాడిపోయాడు రామదాసు.

5098


బలవంతాన కూజాదగ్గిరికెళ్ళి, గ్లాసునిండా నీళ్ళు నింపుకొని గటగటా తాగాడు. కాసిని చేతిలోపోసుకొని, ముఖానికి రుద్దుకొన్నాడు. తుండుతో, దిగజారిపోతున్న చెమటలను తుడుచుకొన్నాడు. గాలన్నావొస్తుందని కిటికీ తలుపులు తెరిచాడు. చల్లగాలి రంయ్యిమని లోపలికొచ్చి, ఆతనికి గిలిగింతలు పెట్టింది.

"అమ్మయ్య!"

అని నిట్టూర్పు విడిచాడు రామదాసు.

ఓ క్షణం కిటికీలోంచి బయటికిచూశాడు. చెట్లమీద పడి వెన్నెల ముక్కలయిపోతోంది. గాలికబుర్లు వింటూ చెట్లు, తలలూపుతున్నాయి.

—తనేదో అనవసరంగా భయపడుతున్నాడుగానీ, నిజానికిందులో భయపడవలసింది దేనికి? తనేమీ కానిపని చెయ్యలేదు. లోకంలో లేనిదీ చెయ్యలేదు. ప్రపంచమంతా ఏదో నో మార్గాన పోతూఉంది. తనూ అదేదోవన పొయ్యాడు. తనతోటివాళ్ళంతా, అంతో ఇంతో పుచ్చుకొంటున్నవాళ్ళే? 'తడి' పడందే కాయితాలు కదలటంలేదు. తన కా సంగతితెలుసు. తెలిసిగూడా తనేమీ చెయ్యలేకపోయాడు. అంటే-ఆమోదించినట్లే! రామనాథం అన్నట్లు-తను గాకపోతే, ఇంకో సరవయ్య ఈపనిచేస్తాడు. ఇది కాస్తా పుచ్చుకొంటాడు. ఆ పనేదో తనేచేసి, తనెందుకు పుచ్చుకోగూడదు? ఇందులో తను అన్యాయంగా ప్రవర్తించడమన్న ప్రసక్తేలేదు. కపాడియాకు లక్షలలాభం చూపెట్టాడు. తను వేలు పుచ్చుకున్నాడు. తప్పేమిటిట? ఎవడో వొకడికి

విధిగా చెయ్యవలసిన ఈపని, కపాడియాకే ఎందుకు చెయ్య గూడదు? అతనన్నమాట నిజమే! ఈ జీతంరాళ్ళతో తను పిల్లల్నేం పైకి తీసుకురాగలడు? తన తరువాత వాళ్ళకేమిస్తున్నాడు? కనీసంచావయినా తన సొంతఇంట్లో చావరాదా? తనొక్కడూ మడిగట్టుకొన్నందువల్ల లాభ మేమిటి?

రామదాసుకు జవాబు దొరకలేదు. ఆలోచించిన కొందికీ అతనిలో అవ్యక్తమైనభయం మళ్ళా పుట్టుకు రాసాగింది. ఎవరో తన దొంగతనాన్ని కనుక్కొన్నట్టూ, తనను నిలవేసి అడిగినట్లూ, తను జవాబు చెప్పలేక గుక్కిళ్ళు మింగుతున్నట్టూ ఊహించుకొని గిజగిజలాడిపోయాడు. తన ఆలోచనలన్నీ ఎవరన్నా వింటున్నారేమోనని చుట్టూ చూశాడు. ఎందుకయినా మంచిదని కిటికీతలుపులు వేశాడు. దీపం వెలిగించడానికి భయపడ్డాడు. ఆ వెలుగులో తనను తను చూసుకోవటానికి జంకాడు రామదాసు.

ధైర్యం కలగడంకోసం, ఆవలించి చిటిక వేశాడు.

తనలో తనే నవ్వుకొన్నాడు.

అసంభవం! నన్నెవరూ చూసుండరు. ఇంకెవరికీ ఈ సంగతి తెలియదు. తెలియడానికి వీల్లేదు!" అనుకొన్నాడు రామదాసు.

అదింకా పూర్తికానేలేదు. ఎవరో తలుపు తోసుకొని మెల్లగా ఆ గదిలో కొచ్చారు. అడుగుల చప్పుడువిని, రామదాసు బెంబేలెత్తిపోయాడు.

"ఎవరది?" అన్నాడు బిగ్గరగా, ఆ మనిషిని గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తో.

మసగ వెలుతురులో, ఆ వచ్చినాయన రామదాసుకు స్పష్టంగా కనిపించడంలేదు. కనిపించిన మేరకు, అతను అజానుబాహు వనుకొన్నాడు రామదాసు. అతనిశరీరం తెల్లగాఉంది. తెల్లనిబట్టలు వేసుకొన్నాడు. కళ్ళు స్వచ్ఛంగా వెలుగుతున్నాయి.

రామదాసు కొయ్యబారిపోయాడు.

ఆ మనిషి నవ్వుతూ దగ్గరగా వచ్చాడు.

ఈసారి "నువ్వెవరు ?" అని గట్టిగా అనలేకపోయాడు రామదాసు.

ఆ వ్యక్తిమాత్రం నవ్వుతూనే ఉన్నాడు.

ఆ నవ్వుచూసి రామదాసు కుంగిపోయాడు. అతని ప్రాణాలు భోరుమని ఏడ్చినట్లయింది.

"నాకంతా తెలుసు !" అన్నా డతను.

రామదాసు ముఖం మాడిపోయింది. పెదవులు ఎండిపోయాయి. నరాలు పట్టుతప్పుతున్నాయి. మాటలకోసం తడుముకొంటున్నాడు.

"ఎందుకా పాడుపని చేశావ్ ?" అన్నా డతను.

రామదాసు తలొంచుకొన్నాడు.

"పలకవేం ?" అన్నా డతను బిగ్గరగా.

ఆ కేకకు రామదాసు ఉలిక్కిపడ్డాడు.

తనను తను సర్దుకొని నిలబడ్డాడు.

"ఏంపని ?" అన్నాడు మెల్లిగా రామదాసు.

"బుకాయించకు. నా కంతా తెలుసు."

"ఏం తెలుసు ?" అన్నాడు రామదాసు.

ఆ వ్యక్తి చిన్నగా నవ్వాడు.

"నే నంతా చూస్తూనే ఉన్నాను రామదాసూ! పది రోజులనుండీ కపాడియా నీ చుట్టూ తిరుగుతున్నాడు. నువ్వు సంతకం చెయ్యలేదు. ఇవ్వాళ పది/వేలు పుచ్చుకున్నావ్! సంతకం చేశావ్!"

"చాలు" అన్నాడు రామదాసు.

ఆ మనిషి మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

"ఎవ్వరూ చూడలేదనుకొన్నాను. ఎవ్వరికీ తెలియదనుకొన్నాను. అన్నిపనులూ చాలా రహస్యంగా జరిగాయనుకొన్నాను. కానీ –" అని ఆగిపోయాడు రామదాసు.

అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నాకు తెలిసింది. అవునా?" అన్నాడతను నవ్వు మానకుండానే!

రామదాసుభుజంమీద మెల్లగా చెయ్యివేశాడు. అంత బలశాలిచెయ్యి మృదువుగా, చల్లగాఉంది.

"నాయనా! నా ఉద్యోగమే ఇది!" అన్నా డతను.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?" అన్నాడు రామదాసు.

"చేసిన తప్పు దిద్దుకోవాలని నీకు తెలేదా?"

"అలాగే!" అన్నాడు రామదాసు కన్నీళ్ళు తుడుచుకొంటూ — "మీరు నాకో చిన్నఉపకారం చెయ్యాలి."

"ఏమి" టన్నట్టు చూశా డతను.

"భార్యా బిడ్డలున్నవాణ్ని. నన్ను దయదలచండి. ఈ సంగతి మీ రికార్డులోనుండి తీసెయ్యండి. ఇంకెప్పుడూ

ఇలాంటి పాడుపని చెయ్యను. ఈ విషయం మీరు పైకి కూడా రాయకండి! ఈ ఉపకారం మీరు తప్పకుండా—"

అతను జవాబుగా నవ్వాడు.

"రేపే కపాడియాకు పదివేలూ ఇచ్చేస్తాను" అన్నాడు రామదాసు.

"మంచిది, నే వెడుతున్నాను" అంటూనే అతను తలుపులు తీసుకొని వెళ్ళిపోయాడు.

దాదాపు పావుగంటదాకా రామదాసు మామూలు మనిషి కాలేకపోయాడు. ఆ తరువాత మెల్లగా తలెత్తిచూశాడు. తలుపులు దగ్గరగా వేసిఉన్నాయి. తీసుకొని వరండాలో కొచ్చాడు. భార్య పిల్లలు నిశ్చింతగా నిద్రపోతున్నారు. రామదాసు అలానే కొయ్యబారిపోయాడు. ఇంతసేపూ, తనగదిలో ఇంత ఘర్షణజరుగుతున్నా వీళ్ళకు మెలుకువ రాలేదేం? ఇంత మొద్దునిద్రపోతున్నారా? అన్నట్టు ఈ పెద్దమనిషి ఎలా వెళ్ళినట్టు? రామదాసు వీధివాకిలిదాకా వెళ్ళొచ్చాడు. వేసిన తలుపులు వేసినట్టేఉన్నాయి. ఎక్కడా మనిషి వెళ్ళినజాడ కనిపించలేదు. మరెలా వెళ్ళినట్టు?

గబగబా భార్యను లేపాడు.

శకుంతల ఆవలిస్తూనే "ఏమిటండీ?" అంది.

"ఇప్పు డెవరన్నా మనిషి ఇటుకేసి రావడం చూశావా?" అన్నాడు రామదాసు.

శకుంతల మత్తు పూర్తిగా వదిలిపోయింది. ఆ వెంటనే ఆమెను భయం ఆవహించింది.

"ఏం మనిషి ? ఎవ్వడు ?" అన్న దావిడ తత్తర పోతూ.

"ఇవ్వాడే ! అంతాకలిసి పావుగంట కాలేదు" అన్నాడు రామదాసు.

శకుంతల లైట్లు వేసింది. తాళాలుతీసి అన్ని గదులూ చూసొచ్చింది. ట్రంకుపెట్టె తాళం లాగిచూసింది. రామదాసు చూపించినచోట జాగ్రత్తగా వెదికింది.

"ఏం లేందే !" అన్నది శకుంతల.

"నేను మాట్లాడితేనే ?" అన్నాడు రామదాసు.

"వస్తే, కాలిజాడలన్నా కనిపించవుటండీ ?" అన్నది శకుంతల విసుగ్గా.

నిజమే మరి ! అక్కడ కాలిజాడలుకూడా లేవు.

"కలేమన్నా వచ్చిందేమో లెండి. లేకపోతే, ఎవ్వరికీ తెలియకుండా ఆ వచ్చేవా డెలా వస్తాడండీ. మీదంతా పోద్యం ! వెనకటికి మా చిన్నాన్న ఒక డుండేవాళ్లండి. నిద్రపోతూనే ఇల్లంతా తిరిగేవాడు. ఉదయ మడిగితే 'అబ్బే!, అదెవ్వడూ ?' అనేవాడు. మీకుకూడా ఆయన సామెత కొచ్చారే !" అన్నది శకుంతల.

"పోనీ అంత ఇదిగావుంటే మీ మంచంకూడా వరండాలోకి పట్టుకోరాదూ ?" అనికూడా అన్నది.

రామదాసు మరేమీ మాట్లాడకుండా తనగదిలో కొచ్చేశాడు. మంచంమీద పడుకొని "ఇది కలయితే ఎంత బావున్ను" అనుకొన్నాడు.

శకుంతల కాఫీకాచి సిద్ధంగాఉంది. రామదాసు ఇంకా

నిద్ర లేవనే లేదు. కాఫీ చల్లారిపోకుండా ఫ్లాస్కులో పోసి నాన్నను లేవమంటూ పిల్లల్నిపంపింది. అప్పటికే ఆవిడ ముస్తాబయి రెడీగాఉంది. పిల్లలకూడా మంచిబట్టలు తొడిగింది. ఆయనగారు పెందరాడే లేచినట్లయితే, ఈ సరికి బజారుకు పోయిఉండవలసింది !

రామదాసు స్నానం ముగించుకొని కాఫీకోసం వచ్చే సరికి తొమ్మిదయింది.

"ఏమిటి కథ" అన్నాడు రామదాసు భార్య ముస్తాబు చూసి.

"రాత్రేదో అంటిరే ?" అన్నది శకుంతల.

"ఎవరో వచ్చినసంగతా ?" అన్నా డతను.

"ఆఁ, నా బొంద !" అని ముతారంగా విసుక్కుంది శకుంతల. "బజారుకెళ్ళి ఏదో కొందామంటిరి గదండీ !"

"ఓహో" అన్నాడు రామదాసు. నెక్లెసుసంగతి జ్ఞాపకంవచ్చి "నాకు టైమయింది కాదూ మరి ?"

"తొమ్మిదేగా ? పదిన్నరకల్లా బజారు అటునించి అటే ఆఫీసుకెళ్ళొచ్చు. మేం టాక్సీచేసుకొని ఇంటి కొస్తాం !" అని పరిష్కారం చెప్పింది శకుంతల.

రామదాసుకు ఏ వంకా తట్టలేదు.

"ఇప్పు డేం తొందర! రేపు చూద్దాంలే!" అన్నాడు తప్పుకోవటానికి.

"కొనదల్చుకొన్న తరువాత ఇవ్వాళైతే నేం ? రేపయితే నేం ? వనంతా పూర్తయింది. ఓ గంటలో తెమిలి పోయేదానికి, మళ్ళా రేపెందుకండీ ?"

రామదాసు జవాబు చెప్పకుండానే వెళ్ళిపోయాడు. భార్య గొణుగుడు అస్పష్టంగా వినిపించింది. పదినిమిషా లయ్యాక, ఫెడీఫెడీమని దెబ్బలూ, చంటిదాని ఏడుపూ రామదాసుకు స్పష్టంగా వినిపించాయి ...

ఆ పూటల్లా రామదాసు అదోలాగా ఉన్నాడు. చూడవలసిన కాయితాలన్నీ బల్లమీద పేరుకుపోతు న్నాయి. అయినా కాయితాలమీద మనస్సు నిలవడంలేదు. అతను వస్తూవస్తూ కపాడియా ఇచ్చినకవరు జేబులో వేసు కొచ్చాడు. కవరు తీస్తున్నప్పుడు భార్య అక్కడే ఉంది.

"అది తీస్తున్నారేం ?" అన్నది శకుంతల.

రామదాసు పలకలేదు.

"మీరుగానీ నెక్లెస్ తీసుకొస్తారా ?"

దీనికి రామదాసు జవాబివ్వలేదు.

"తెస్తేమాత్రం నీలం, ఆకుపచ్చ రాళ్ళున్నదాన్నే తీసుకురండి, అందుకే నేను ఉదయం పోదాంబాబూ అంటే మీరు వినకపోతిరి !" అన్నది శకుంతల.

రామదాసు మాట్లాడకుండా ఆఫీసుకొచ్చాడు. రాగానే కపాడియాకు ఫోన్‌చేశాడు. సాయంత్రంగానీ రాలే నన్నాడు కపాడియా.

అతను పది వేలరూపాయలనూ తిరిగి ఇచ్చేద్దామను కొన్నాడు. కానీ అలా ఇవ్వబోయేముందు, అతనిమనస్సులో చాలా సంక్షోభం జరిగింది. నిజంగా రాత్రివచ్చింది కలేనా అని, ఎంతోసేపు తర్కించుకొన్నాడు. కానీ, తనా మనిషితో మాట్లాడాడు. అతనినవ్వు ఇప్పటికీ తన చెవుల్లో ప్రతిధ్వ

నిస్తూఉంది. అతని హాస్తస్పర్శ ఇప్పటికీ తనకు జ్ఞాపకంఉంది. కలకానిపక్షంలో మనిషివచ్చిన జాడలన్నా ఉండాలి. అలాంటి వేమీా కనిపించడంలేదు-ప్రభుత్వం అద్భుతమైన సిఐడీలను నియమించిం చేమో? వాళ్ల రాకపోకలు సామాన్యంగా అంద రికీ తెలియ వేమో? ఆ శాఖలోవారేతప్ప, ఇతరులు వాళ్ళను కనుక్కో లేరేమో! ఇదే నిజమయినపక్షంలో రాత్రి జరిగిన సంఘటన కలగానిపక్షంలో, అతను దేవాంతకు డనుకో వలసిందే! తన చర్యలన్నీచూసినట్టు చెప్పాడు. ఒక్క అక్ష రం పొల్లుపోలేదు మరి!

రామదాసు చిరాగ్గా కుర్చీలో కదిలాడు. అతని తలం తా నాదుగాఉంది. కండలన్నీ నొప్పులుగా ఉన్నాయి.

"అబద్ధం" అనుకున్నాడు రామదాసు బిగ్గరగా.

ఇదే తనకుప్రారంభం. అందులోనూ, దీన్ని గురించి తెగ ఆలోచించాడు. ఈ జోలాంతరంలో ఉండటంవల్ల, తనకు అటువంటి కల వచ్చిఉంటుంది. అంతేగానీ, ఎవ్వరికీ తెలియకుండా మనిషి రావడమేమిటి? తను పొరపాటుపడితే, శకుంతల పడుతుందా? అడుగుజాడలన్నా ఉండవా? కనీసం వీధి తలుపులన్నా తీయడా? గాలిలో వచ్చి గాలిలో పోవ డానికి దేవుడాయేం? నిజంగా యిది కలే! నరాల బలహీ నతవల్ల, తనకంతా నిజమనిపిస్తోంది! అంతే!! అనేకసార్లు తనకు కలలొచ్చాయి. కొన్ని కలల్లో తను మబ్బులమీద పరుగెత్తాడు. అంటే నిజంగా పరుగెత్తినట్టేనా? ఇంకోసారి సుభద్రను ముద్దుపెట్టుకొన్నట్టు కలొచ్చింది! అయితే??

"అబ్బే! కల కల!!" అనుకొన్నాడు రామదాసు.

ఈ నిశ్చయానికొచ్చాక, అతనికి పది వేలూ ఇవ్వబుద్ధె య్యలేదు. సాయంత్రం వచ్చిన కపాడియాతో ఆమాటా ఈమాటా మాట్లాడి పంపేశాడు.

"తెచ్చారా?" అన్నది శకుంతల, భర్త-జేబులో చెయ్యి పెట్టటం చూచి.

"లేదు" అన్నాడు రామదాసు.

శకుంతలముఖం కందిపంతపనయింది.

"ఒకటి రెండుకొట్లు చూశాను. అన్నీ నాకు బాగానే ఉన్నాయి. అన్నీ కొనెయ్యాలనిపించింది. అందుకని రేపు నువ్వెళ్ళి కొనుక్కో" అన్నాడు రామదాసు, అబద్ధమని శకుంతలకు తెలియకుండా జాగ్రత్తపడి.

"మీరు లేకుండానా? నే నా నెక్లెసన్నా మానుకుం టాను గానీ, మీరులేకుండామాత్రం పోనుబాబూ?" అన్నది శకుంతల నయుగారాలుపోతూ.

దురదృష్టవశాత్తూ రామదాసుకు ఈపూటకూడా నిద్ర పట్టలేదు. అతను పది వేలరూపాయలతో ఏమేం చెయ్య వచ్చునో ఆలోచిస్తున్నాడు. ఇందాక కపాడియా వచ్చి నవ్వాడు, మరికొంత మొత్తం ఎల్లుండి పట్టుకొస్తానన్నాడు. అదీ ఇదీ కలిపి ఇల్లుకొనాలనుకొన్నాడు రామదాసు. ముందు చిన్నపూలతోట, వెనకాతల పెద్దపెరడు, అందులో కూర గాయలతోట, పక్కనే గారేజి. పెద్దాడికీ, చిన్నాడికీ రెండు విడివిడి గదులు ,తనకో డ్రాయింగ్ రూం...ఓ రేడియోగ్రాం, మంచి ఫర్నీచరు, బెల్జియంఅద్దాలూ ... ఇలా ఆలోచిస్తు న్నాడు. హఠాత్తుగా అతనికి తలుపు కదిపినచప్పుడు వినిపిం

చింది. రామదాసు కళ్ళెంతచేసుకొని అటుకేసి చూశాడు. చూస్తూనే నిశ్చేష్టుడయ్యాడు. నిన్నటి సిఐడీ మళ్ళావచ్చాడు.

ఈపూట అతనిముఖంలో నిన్నటి నవ్వులేదు. కోప చిహ్నాలు కనిపిస్తున్నాయి.

"ఎందుకయ్యా అలా నాతో అబద్ధమాడతావ్?" అన్నా డతను.

రామదాసు వణికిపోయాడు. అతనికి నవనాడులూ కుంగిపోయాయి. రక్తమంతా ఓడ్చుకుపోయిన వాడిలాగా, పాలిపోయ్యాడు.

"ఉదయం—" అని గొణిగాడు రామదాసు.

"పదివేల రూపాయలూ ఆఫీసుకు పట్టుకొచ్చిన వాడివి కపాడియాకు ఇవ్వలేకపోయావా? ఫోనుచేసి పిలిపించావుగదా! ఆమాటా ఈమాటా మాట్లాడావేగానీ, తిరిగిచ్చే ప్రసక్తి రానేలేదే! పైగా ఎల్లుండి ఇంకేదో ఇస్తానంటే సరేనని వొప్పుకొన్నావుగదా! ఎందుకిదంతా చేస్తున్నావ్? ఏం బావుకొందామని చేస్తున్నావ్? నువ్వేదో సుఖపడాలని నీతాపత్రయం! అవునా? ఇందువల్ల సుఖం లభిస్తుందని నువ్వొక్కనాటికీ అనుకోకు. సుఖపడుతున్నావని అందరూ అనుకొంటారు. అదే నీకు దక్కుతుంది. కానీ అందువల్ల నీఅనుభవంలోకి ఈమణ్మాత్రం రాదు. రాబోదుకూడా. ప్రతిక్షణం నిన్ను పురుగులు తొలుస్తూనే ఉంటాయి. నిన్ను తినేస్తూనే ఉంటాయి. ఆబాధలు భరించటం ఇంతకన్నాకష్టం! కాదు కూడదంటే రాగల దుష్ఫలితాలను అనుభవించటానికిసిద్ధంగా

ఉండమనిమాత్రమే నేను చెబుతాను. ఆ తరువాత నీఇష్టం!" అన్నాడు అతను.

అతనికంఠం స్పష్టంగా స్ఫుటంగా ఉంది. అందులో గాంభీర్యం మార్దవంకూడా ఉంది. కన్నుల్లో కోపంఉన్న ట్లనిపించినా, అపారమైన దయ తొణికిసలాడుతూ ఉంది.

రామదాసు ఆమూర్తిని కన్నెత్తి చూడలేకపోయాడు. తలొంచుకొన్నాడు.

"ఏమంటావ్ ?" అన్నా డతను.

రామదాసు పలకలేదు.

"తప్పని తెలిసికూడా చేసే అధములు ఈమూర్త్యాన్నికూడా కోలుపోవలసివస్తుంది. అమాయికులు తెలియక చెయ్యవచ్చు. వాటిని మన్నించగలను. కానీ, తెలిసి చేసినవారిని మన్నించమంటే, నా హద్దుల్ని మీరినట్లవుతుంది. అది నా కిష్టంలేదు. నిన్ను నేను బలవంతపెట్టను.

కానీ, శిక్షనుండిమాత్రం నువ్వేనాడూ తప్పుకోలేవు. నీ నేరం నిన్ను నీడలా వెంటాడుతూనే ఉంటుంది!"

రామదాసులో దుఃఖం కట్టలుతెగి ప్రవహించ సాగింది. కన్నీళ్ళు ధారావాహికంగా కారిపోతున్నాయి. ఆ నీటిధారల వెనుక, అతనిమూర్తి క్రమక్రమంగా మసకయి పోయింది. రామదాసు "హాహాకారు" మని రోదిస్తూనే ఉన్నాడు. వెక్కిళ్లు పడుతూనే ఉన్నాడు. డొక్కలు ఎగరేస్తూనే ఉన్నాడు. అతని కన్నీటితో తలగడలన్నీ తడిశాయి-

శకుంతల ఉలిక్కిపడి లేచింది. మంచంమీద బోర్లగా పడుకొని, పసివానిలా రోదిస్తున్న భర్తనుచూచి నిర్వీణ్ణురాలయింది.

"ఏమిటండీ?" అన్నా డగ్గుత్తికతో? రామదాసు పలక లేదు, ఏడుపు మాన లేదు.

ఆ స్థితిలోఉన్న భర్తనుచూశాక ఆమె కళ్ళలోనూ నీటిజీరలు మోసులెత్తాయి. భర్తను ఆప్యాయంగా కౌగలించుకొని, దగ్గరగా పొదువుకొంది.

"నాతో చెప్పరూ ?" అన్నది మెల్లిగా.

"వద్దు, మనకొద్దు" అని గొణిగాడు రామదాసు అస్పష్టంగా.

శకుంతలకు ఛట్టున స్ఫురించింది.

"ఆ డబ్బేనా ? అన్నది" శకుంతల, భర్తతల నిమురుతూ.

రామదాసు పలక లేదు.

"పోనిద్దురూ వెధవపీడ. ఇంతకాలం, ఈ వేలతోనే బ్రతికామంటారా ? రేపు పట్టుకెళ్ళి వాడిది వాడికిచ్చేయండి. ఈ రెండురోజులూ మీరు ..."

దుస్స్వప్నం విచ్చిపోయింది.

రామదాసు తేరుకొన్నాడు.

ఆ తరువాత ఇంకెప్పుడూ, రామదాసుకు అలాంటి "కల" రాలేదు.